నాది ఎప్పుడూ టూర్లకి వెళ్ళే ఉద్యోగం. నెలకి ఇరవయ్యయిదు రోజులు కాంపుల్లోనే వుంటాను.

మా పెళ్ళయిన ఈ అయిదు సంవత్సరాలలో మేమిద్దరం కలిసి ఎక్కడికీ వెళ్ళలేదనే బాధ మా ఆవిడ మాటల్లో తరచు బయటపడుతుంటుంది.

# మాసి వాయనం



'అమ్మాలు'

ఢిల్లీకి ట్రాన్స్‌ఫరయి వచ్చి అప్పడే ఆరు నెలలయిపోయింది. ఇంతకు ముందు కాన్పూరులో వుండేవాళ్ళము. ఈ సారి కాంప్‌కి మా ఆవిడ తను కూడా వస్తానని ముచ్చపడుతుంటే కాదనలేక ఒప్పుకున్నాను.

నేను ఎప్పుడు కాంప్ కెళ్ళినా అప్పటికప్పుడు బయల్దేరడమేకాని, ముందుగా రిజర్వేషన్లు చేయించుకోవడం లాంటివేవీ అలవాటు లేదు నాకు. రిజర్వేషన్ దొరకలేదంటే ఉద్యోగం సంగతి ఇంతే సంగతులు. ఒక గంట ముందు ఢిల్లీ రైల్వే స్టేషను చేరుకున్నాము. సెకండు క్లాసు టిక్కెట్లు రెండు తీసుకుని బండి ఎక్కేశాము ఇద్దరం. ఆ రోజు ఎప్పటి కంటె రద్దీగా వుంది ట్రైను. అంత దూరాన ఎవరివో టిక్కెట్లు చెక్ చేస్తున్నటి.టి.ఇ. కన్పించాడు. నేను గబగబా అతని దగ్గరగా వెళ్ళి పక్కకి రమ్మని పిలిచాను. టిక్కెట్లయితే సెకెండు క్లాసువే కానీ మేము తొందరలో ఎక్కింది ఫస్టుక్లాసు కంపార్టుమెంట్. తర్వాత నలుగురిలో టి.టి.ఇ. చేత చెప్పించుకోవడం కన్నా ముందే మాట్లాడడం మంచిది కదా.

నేను అతనిని పక్కకు పిలిచి రహస్యంగా అన్నాను "సార్! మేము ఫామిలీతో బయలుదేరాము. రిజర్వేషను దొరకలేదు. కాన్పూరువరకూ మీతో తీసుకుపోగలరా" అని. ఈ రూట్‌లో వెళ్ళే టి.టి.ఇ.ల సంగతి నాకు బాగా తెలుసు.

అతను "టిక్కెటివ్వండి బెర్త్ ఎలాట్ చేస్తానన్నాడు. సెకెండు క్లాసు టిక్కెట్లు అని చెప్పి అతని చేతిలో వుంచాను. అతను "ఫరవాలేదు, డిఫరెన్స్ ఫేర్ ఇవ్వండి. రసీదు ఇస్తా" నన్నాడు.

"ఎఫ్ కూపేలో రెండు బెర్తులున్నాయి. అవి కాన్పూర్ కోటా. అందులో కూర్చోండి." మా టిక్కెట్ల తాలూకు డిఫరెన్స్ ఎమౌంట్ రెండు వందల రూపాయలు తీసుకుని వెళ్ళిపోయాడు. రసీదు తర్వాత ఇస్తాడు లెమ్మని అనుకుంటూ ముందుకు కదిలాను.

ఏమైందంటూ కుతూహలంగా చూసిన మా ఆవిడకు జరిగింది చెప్పాను. నేను చేసిన పొరపాటు పని అదేనని అరగంట తర్వాత తెలిసింది నాకు. అరగంట సేపు టి.టి.ఇ. కోసం ఎదురుచూస్తూ కూర్చున్నా. మా ఆవిడ నసపెట్టడం ప్రారంభించింది. "అతడింకా రాడేమిటండీ. రసీదు ఇవ్వలేదు. టిక్కెట్లూ ఇవ్వలేదు. డబ్బు పోయి శని పట్టిందన్నట్లు ఇలా చేసారేమిటి? అప్పడే రసీదు తీసుకోక" అని పెనం మీది ఆవగింజలా చిటపట్లాడిపోవడం మొదలెట్టింది. నేరకపోయి చెప్పానురా భగవంతుడా అని చెంపలు వాయించుకున్నాను. భార్యతో తొలిసారి కూపేలో ప్రయాణం బాగా ఎంజాయ్ చేద్దామని ఆశపడితే, వున్న నాలుకకు మందేస్తే కొండ నాలుక మాయం అయిందన్నట్లు అయింది నా పరిస్థితి. మా వాగ్వివాదంలోనే రైలు నాలుగు స్టేషన్లు దాటేసింది. రైల్లో ఒకరిద్దరిని అడిగి కనుక్కుంటే తెలిసింది, అతను ఆ రైల్లో వున్న మొత్తం టి.టి.ఇ. ల బాచ్‌కి ఇన్‌ఛార్జి అని. ఆ మాటే మా ఆవిడకు చెప్పి శాంతపరిచాను. ఏదో చిన్న స్టేషనులో రైలు ఆగితే ప్లాట్‌ఫారం మీద దిగినప్పుడు పక్కన ఎవరో మాట్లాడుకుంటుంటే విన్పించింది, పక్క స్టేషనులో సర్‌ప్రైజ్ మెజిస్ట్రీరియల్ చెకప్ వుందని.

డిఫరెన్స్ ఫేర్ చెల్లించామన్న మాటేకానీ టిక్కెట్లు కానీ, రసీదు కానీ దగ్గిర లేవు. వచ్చే స్టేషనులో చెకింగు లేకుండా చెయ్యి భగవంతుడా అని మనసులోనే దణ్ణాలు పెట్టుకోసాగాను. కోరుకున్న ఏకాంతం చేపట్టిన భార్యతో పొంది కూడా అనుభవించలేని స్థితిలో వున్నాను. దొరికిన ఏకాంతం కాస్తా కనిపించని దేముళ్ళకు మొక్కుకోవడంలోనే గడిచిపోయింది నాకు. చెకింగ్‌లో పట్టుకుంటే ఉద్యోగం సంగతి ఎలా వున్నా, ఫామిలీతో జెయిలు కెళ్ళిన ఘనత కూడా దక్కిందంటే ఇంతే సంగతులు. నా అదృష్టమో, టి.టి.ఇ. అదృష్టమో కానీ తర్వాతి ఏ స్టేషనులోను చెకింగ్ జరగలేదు. ఏదైనా ఆపద వస్తుందని తెలిసినప్పుడు అది వచ్చేదాకా టెన్షన్‌తో ఎదురు చూస్తూనే గడిపేస్తాము. దాని గురించి తెలియనప్పుడు జీవితం సప్తవర్ణ కావ్యంలా కన్పిస్తుంది కళ్ళకు.

రాత్రంతా అలా జాగరణ చేశాక తెల్లవారు ఝామున కునుకు పట్టుండగా తలుపు మీద టక్ టక్ మన్న చప్పుడికి మెలకువ వచ్చింది. అదురుతున్న గుండెలతో తలుపు తీశాను. ఎదురుగా నవ్వు ముఖంతో టి.టి.ఇ. నిల్చుని వున్నాడు. చొరవగా లోపలికొచ్చి విష్ చేశాడు. "గుడ్ మార్నింగ్. రాత్రి బాగా నిద్ర పట్టిందనుకుంటాను. ప్రయాణం బాగా ఎంజాయ్ చేశారా" అంటూ మా ఇద్దరివైపు అదోలా చూశాడు. ముసలి పీనుగ, ముచ్చు వెధవ— వీడి మూలానే బంగారం లాంటి అనుభవం చేజారిపోయింది. వెధవని

కత్తితో కండగా చీల్చి కాకులకూ, గద్దలకూ వేసినా పాపం రాదు అనుకుని పళ్ళు నూరుకున్నాను.

"మీరు నాకో సాయం చేయాలి. కష్టమయిందేమీ కాదులెండి" అన్నాడు ఏ ఉపోద్ఘాతం లేకుండానే.

"ముందు మా టిక్కెట్లు మా మొహాన పారే యండి. రసీదు కూడా" అన్నది కటువుగా మా ఆవిడ.


వెంటనే రెండు టిక్కెట్లు తీసి మా ఆవిడ చేతిలో పెట్టాడు.

ఏం చేయమంటావని అడిగాను.

"ఏం లేదు సార్! రైలు ఇక్కడ అరగంట ఆగు తుంది. మీరు వెళ్ళి నాకు మూడు ప్లాట్‌ఫారం టిక్కెట్లు తెచ్చివ్వండి. మీ మేలు మరువను" అన్నాడు టి.టి.ఇ.

'ఓస్ ఇంతేనా. ఈ మాత్రం దానికి అంతగా అడగాలా' అనుకుంటూ సరే అన్నాను.

ట్రైను దిగాక కూలీచేత సామాన్లు ఎత్తించుకుని బయటకు వచ్చాక, సామాన్లు దింపించి మా ఆవిడను చూస్తుండమని చెప్పి, నేను గబగబా వెళ్ళి మూడు ప్లాట్ ఫారమ్ టిక్కెట్లు తీసుకుని మళ్ళీ ప్లాట్ ఫారమ్ మీదికి వచ్చి, టీ స్టాల్ దగ్గిర నిలబడిన టి.టి.ఇ. చేతికిచ్చాను. అతను అందులోనించి రెండు తను వుంచుకుని మూడోది నాకిచ్చేసాడు. వాటితో ఏం చేయదలచు కున్నాడో నాకు అర్థం కాలేదు. అదే అడిగాను. అతడు మాట్లాడకుండా చేతిలోని రెండు టిక్కెట్లు అతడికి




నాలుగడుగుల దూరంలో నిల్చున్న ఇద్దరు యువకుల చేతుల్లో పెట్టాడు. వాళ్ళని తీసుకుని బయటకు వెళ్ళి పోయాడు. నాకిదంతా మిస్టరీగా కన్పించింది. వాళ్ళను పంపించి టి.టి.ఇ. నా దగ్గిరకొచ్చాడు.

"పదండి సార్! టీ తాగుదాం" అని కాంటీను వైపు దారి తీసాడు.

నా భార్య బయట నాకోసం ఎదురుచూస్తున్నదని చెప్పాలనుకుని చెప్పలేకపోయాను. నాలోని క్యూరియా సిటీ అలాంటిది.

"మీరు నాకు చేసిన సహాయానికి చాలా థాంక్స్ సార్. మీ మేలు జన్మలో మర్చిపోను" అంటూ తనే టీ కి బిల్లు పే చేశాడు నేను వద్దన్నా వినకుండా. ఇద్దరం బయటకు వచ్చాక అతడు మా శ్రీమతి చేతిలో రెండు వందల రూపాయిలు వుంచుతుంటే ఆశ్చర్యంతో నోట మాటరాలేదు మా ఇద్దరికీ. నిజానికి అతడు వంద రూపాయలు వాపసు చేసినా ఎక్కువే. అలాంటిది సెకెండు క్లాసు టిక్కెట్లతో ఫస్టు క్లాసులో ప్రయాణం చేసింది కాక ఇచ్చిన డబ్బు కూడా వాపసు చేస్తే ఆశ్చర్యం వెయ్యదూ!

మేము ఆటో ఎక్కబోతుండగా అతను నన్ను ఆపి చెప్పాడు, "ఈ రోజు ఈ స్టేషనులో విజిలెన్స్ చెకింగ్ జరిగింది. ఆ ఇద్దరి వద్ద టిక్కెట్లు లేవు. టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేయనిచ్చినందుకు నా ఉద్యోగం వూడడమేకాక రిటైరయితే వచ్చే పెన్షను కూడా పోతుంది. రేపో మాపో రిటైరయిపోయేవాణ్ణి. ఇలా జరిగితే నలుగురిలో తలెత్తుకు తిరిగే అదృష్టం కూడా మిగలదు. మీరు దేవుడిలా నన్నాదుకున్నారు. ఏమిచ్చినా మీ రుణం తీరదు" అన్నాడు నా చేతులు పట్టుకుని.

నాకిప్పుడొక గొప్ప సత్యం బోధపడింది. రైల్వేకి నష్టం కలిగిస్తున్నదెవరో కనుక్కో గలిగాను.

